www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 ఆగస్టు 2025
5
అన్నమయ్య



వైభవం...శ్రీరాముడి పట్టాభిషేకం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: శ్రీపట్టాభిరామాలయంలో పట్టాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాతసేవ మొదలై ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేదికగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మండపాన్ని విశేష అలంకరణలతో వేదికను తీర్చి సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, విశేష భక్తజనం నడుమ పట్టాభిరాముడికి కిరీట ధారణ గావించి, పట్టాభిషేక మహోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రికి విశేషాలంకృతుడైన పట్టాభి రాముడిని గరుడ వాహనంపై పురవీధులలో విహరించారు. కార్యక్రమాలలో టిటిడి అధికారులు, ఆగమ పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పట్టాభిషేకాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

బొప్పాయికి దళారుల దెబ్బ



అక్కడ దళారులదే రాజ్యం..వారు చెప్పిందే ధర.. దిగజారిన ధరలతో బొప్పాయి రైతు దిగాలు చెందుతున్నారు. కాయలు కోయాలా వద్దా? అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. కోత సమయంలో అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నా కొనుగోలుదారులు ముందుకు రాకపోవడం గమనార్హం. రూ. వేలల్లో రైతులు నష్టపోతున్నారు. మద్దతు ధర లభించకపోవడంతో భవిష్యత్తులో పంట సాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గంలోని రైతులు మద్దతు ధర కోసం తరచూ రోడ్డెక్కుతున్నారు.

- దక్కని గిట్టుబాటు ధర
- కిలో రూ.16 నుంచి రూ.7కు పడిపోయిన వైనం
- దళారుల దోపిడీతో రోడ్డెక్కిన రైతులు
- గిట్టుబాటు ధర కల్పించాలంటూ ఆందోళనలు
- కిలోకి రూ.25 చెల్లించాలంటూ డిమాండ్



ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, వాల్మీకిపురం, రాజంపేట ఓబులవారిపల్లె ప్రాంతాలలో బొప్పాయి పంటను ఎక్కువగా సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1965.50 ఎకరాల్లో రైతులు బొప్పాయి పంటను సాగు చేశారు. బొప్పాయి ఒక ఎకరాకు రూ.1.50 లక్ష ఖర్చు వస్తుందని, ఎకరాకు వెయ్యి మొక్కలు నాటితే రెండు నెలలకు కాపు వస్తుంది. ఎకరాకు 15 టన్నులు బొప్పాయి పంట వస్తుంది. ఈ ఏడాది సరైన పంట రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి, దళారులు, స్థానిక వ్యాపారులు ఇష్టారాజ్యంగా బొప్పాయి కొనుగోలు చేస్తుండడంతో రైతన్నలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి సంవత్సరం దళారుల వ్యవస్థ జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం పట్టించు కోవడం లేదు.

దళారుల సిండికేట్.. భారీగా తగ్గిన ధరలు

జిల్లాలోనే బొప్పాయి ధరల్లో తీవ్రమైన వ్యత్యాసం కనిపిస్తోంది. దళారులు సిండికేట్‌గా ఏర్పడటంతో భారీగా ధరలు తగ్గాయి. పీలేరు, కలికిరి ప్రాంతాలలో బొప్పాయి కిలో రూ.16కు (టన్ను రూ.16 వేలు) కొనుగోలు చేస్తున్నారు. రైల్వేకోడూరులో స్థానిక వ్యాపారులు, దళారులు, మార్కెట్లు అందరు కలిసి సిండికేట్‌గా ఏర్పడి బొప్పాయికి ధరలు తగ్గిస్తున్నారు. జులై 10వ తేదీన కిలోకు.16 (టన్ను రూ.16 వేలు), 14న కిలో రూ.14 (టన్ను రూ.14 వేలు), 23న కిలో రూ.13 (టన్ను రూ.13 వేలు), 28న కిలో రూ.11 (టన్ను రూ.11 వేలు), 31వ తేదీన కిలో రూ.7 (టన్ను రూ.7 వేలు) కొనుగోలు చేస్తున్నారు. కనీసం కిలో రూ.25లతో కొనుగోలు చేస్తే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. పైగా సూట్ పేరుతో వెయ్యి కిలోలు బొప్పాయి విక్రయిస్తే వంద కిలోలను బలవంతంగా దళారులు, స్థానిక వ్యాపారులు, మార్కెట్లు తీసుకుంటున్నారు. తీవ్రంగా నష్టపోతున్న రైతన్న దళారుల ఆటకట్టించి తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఢిల్లీ, బొంబాయి, మార్వాడి సేట్లతో స్థానిక వ్యాపారులు, దళారులు అందరు కలిసి కిలో రూ.7లకు తగ్గించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొప్పాయి సాగు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 1965.50 ఎకరాల్లో రైతులు బొప్పాయి పంటను సాగు చేశారు. రైల్వేకోడూరులో 600 ఎకరాలు,చిట్వేలిలో 450, ఓబులవారిపల్లెలో 250, వాల్మీకిపురంలో 175, రాజంపేటలో 150, పెనగలూరులో 142, పుల్లంపేటలో 40, మదనపల్లెలో 10.50, రామసముద్రంలో 18, నిమ్మనపల్లిలో 43, గుర్రంకొండలో 22, నందలూరులో 10, వీరబల్లిలో 20, టి.సుండుపల్లిలో12, సంబేపల్లిలో 7, ములకలచెరువులో 4, బి.కొత్తకోటలో 2, పెద్దతిప్పసముద్రంలో 2, తంబళ్లపల్లిలో 2, పెద్దమండెంలో 4, కురబలకోటలో 2 ఎకరాలలో బొప్పాయి పంటను రైతులు సాగు చేశారు.

పెట్టుబడి రావడం లేదు



బొప్పాయి పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. కూలీలు, ఎరువులు, దుక్కులు ఖర్చులు పెరిగిపోయాయి. దళారులు బొప్పాయి పంటను కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరను కల్పించి బొప్పాయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- కె.వెంకటరమణ, రైతు, పుల్లంపేట.

రైతులను మోసగిస్తున్న దళారులు



వ్యాపారస్తులు సిండికేట్‌గై బొప్పాయి ధర తగ్గిస్తున్నారు. రూ.లక్షలు, కోట్లలో వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులు, మధ్య దళారులు నియంత్రించాలి. లైసెన్సులు లేని వారిపై చర్యలు తీసుకోవాలి. లైసెన్సు ఉన్న వ్యాపారస్తులు గిట్టుబాటు ధర లేకుండా, ధర తగ్గించి, రైతులను మోసం చేస్తున్నారు. అలాంటి వారి లైసెన్సులు రద్దు చేయాలి. టన్నుపై రైతు రూ.1.50 లక్షల నష్టపోతున్నారు. వెయ్యి కిలోలకు వంద కిలోలు సూటు పేరుతో తీసుకుంటున్నారు. సూటును రద్దు చేయాలి. వ్యాపారస్తులపైన ప్రభుత్వ నియంత్రణ లేదు. బొప్పాయి రైతులకు కిలోకు రూ.25 (టన్నుకు రూ.25 వేలు) గిట్టుబాటు ధర కల్పించాలి.

- సి.హెచ్.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం



జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, రాజంపేట ప్రాంతాల్లో బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం. ప్రస్తుతం కిలో రూ.13, రూ.14 (టన్ను రూ.13, రూ.14 వేలు) ధర ఉంది. బొప్పాయి రైతులతో మాట్లాడాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ, వ్యాపారస్తులు, రైతులతో సమావేశం నిర్వహించి సరైన గిట్టుబాటు ధరలు కల్పిస్తాం. బొప్పాయి రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు.

- సుభాషిణి, జిల్లా ఉద్యానవన అధికారి, రాయచోటి.


రైతులతో వాగ్వివాదం చేస్తున్న సిఐ హేమసుందర్

గిట్టుబాటు ధరకు రోడ్డెక్కిన రైతులు

రైల్వేకోడూరు: బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతులు కడప-చెన్నయ్ ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. చిట్వేలి-కడప-తిరుపతి ప్రధాన రహదారులలో బొప్పాయి లోడు కోసం వెళుతున్న లారీలను ఆపి లారీలలో ఉన్న గడ్డి, పేపర్లను రైతులు రోడ్డుపై వేసి తగలబెట్టారు. సిఐ హేమసుందర్ నిరసన తెలుపుతున్న రైతుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకుంది. బొప్పాయి వ్యాపారస్తులు, సేట్లు సిండికేట్‌గా ఏర్పడి బొప్పాయి రైతులకు ధర తగ్గిస్తున్నారని, మధ్య దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు డిమాండ్ చేశారు. రాజంపేట సబ్ కలెక్టర్‌ను గిట్టుబాటు ధర కల్పించాలని కోరగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మరుసటి రోజే నుంచే దళారులు, సేట్లు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారస్తులపైన ప్రభుత్వం నియంత్రణ లేదని, బొప్పాయి రైతులకు కనీసం కిలో రూ.25 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వైఖరి మారాలని, కేసులు పెడతామని బెదిరించడం మానుకోవాలని, మోసం చేస్తున్న దళారులపైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బొప్పాయి రైతులు హెచ్చరించారు.

రైతులను ఆదుకోండి : 'కొరముట్ల'

కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు ఆపి రైతులను ఆదుకోవాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులకు సహాయం చేస్తామని చంద్రబాబు నాయడు ఎన్నికల ముందు బహిరంగ సభలో అబద్ధపు హామీలిచ్చి మాటతప్పారన్నారు. మామిడి, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారని, తాజాగా దళారుల మోసాలతో దగాపడ్డారన్నారు. బొప్పాయి ధర టన్ను రూ.20 వేలు ఉండగా నేడు అమాంతంగా రూ.ఆరు వేలకు పడిపోయిందన్నారు. దళారీ వ్యవస్థ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ రఫీ, ఎంపిటిసి బండారు మల్లికార్జున పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర అందేలా చూస్తా : 'ముక్కా'

బొప్పాయి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, గిట్టు బాటు ధర అందేలా చేస్తానని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. గురువారం రెవెన్యూ సభా భవనంలో తహశీల్దారు అమర్నాథ్ ఆధ్వర్యంలో బొప్పాయి రైతు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పాయికి గిట్టుబాటు ధర లభించక దళారి వ్యవస్థ వల్ల రైతులు తీవ్రమైన నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరిం చానని చెప్పారు. శుక్రవారంలోగా అధికారులతో పాటు బొప్పాయి రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారన్నారు. కనీస గిట్టుబాటు ధర లభిం చేలా దళారీ వ్యవస్థకు చెక్ పెట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యతను గురువులే తీసుకోవాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధిలోని అర్చన విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయుల నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ ఉత్తమ బోధకుడిగా మారి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వాటిని చక్కగా అమలు చేసి ప్రతినిత్యం అంకితభావంతో ఉపాధ్యాయులు పనిచేసి ప్రభుత్వ విద్యకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు కాలానుగుణంగా కొత్త కొత్త బోధన పద్ధతులను అవలంభిస్తూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. అనంతరం నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు చట్టం తీసుకురావడం హర్షణీయమన్నారు. నాలుగు డిఎ లు పెండింగ్ ఉన్నాయని, పిఆర్‌సి ఇప్పటికే ఆలస్యమైందని చెప్పారు. వెంటనే ప్రకటించాలని కోరారు. విద్యాసంస్థల డైరెక్టర్ మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టిఎన్‌యుఎస్ జిల్లా అధ్యక్షులు సంజీవ రెడ్డి, షమీవుల్ల, ప్రధానో పాధ్యాయులు, రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్


మాట్లాడుతున్న రామాంజులు

వివిధ రంగాల్లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు తెలిపారు. గురువారం సిఐటియు కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు హాజరవుతున్నారన్నారు. జిల్లాలో పలురంగాలలో 4 లక్షల పైచిలుకు కార్మికులు ఉన్నారన్నారు. వీరు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల గురించి, వాటి పరిష్కారమార్గాల గురించి సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సిఐటియు విస్తరణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఆయన కార్మికులకు, నాయకులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. జిల్లాలోని సమగ్ర శిక్ష, ఎపిఎండిసి, ఆప్కాస్ ఉద్యోగులు, విద్యుత్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం కార్మికులు, సంఘమిత్రలు, గ్రామసేవకులు, మున్సిపల్ వర్కర్స్, బీడి, ఆటో, హమాలీ, భవన నిర్మాణం, ఇన్స్యూరెన్స్, పోస్టల్, బిఎస్‌ఎన్‌యల్, ప్రకతి వ్యవసాయ ఉద్యోగులు పాల్గొనాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.వి.రమణ, విద్యుత్ యూనియన్ నాయకులు సుబ్రమణ్యంరాజు, ఎల్ఐసి నాయకులు ఆదినారాయణరెడ్డి, విశ్వనాథ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తామంటూ రాజకీయ నాయకులు మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కమిటీలు వేయడం, మోసం చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా జంతర్ మంతర్‌లో అన్ని రాష్ట్రాల వాల్మీకిలతో కలిసి మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ఎస్‌టి సాధన ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోశాధికారి విజయ మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు తరకొండ రఘు, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు డేగల రామకృష్ణ, కట్టుబావి మధు, పి.కమలాకర్, పసుపులేటి సూరి, మేకల భరత్, మేకల గుర్రప్ప, టి.శంకర పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు : ఇఎస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. గురువారం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మద్యం షాపు వద్ద క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని, స్కాన్ చేయగానే నాణ్యమైన మద్యం విక్రయిస్తున్నారా లేదా, మద్యం అధిక ధరలు అమ్ముతున్నారా అనే ప్రశ్న రావడం జరుగుతుందన్నారు. మద్యం అధిక ధరలకు అమ్ముతుంటే అందులో ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుం టామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.ఒ ద్వారా జిల్లాలో నాటు సారా అరికట్టడానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 71 ప్రాంతాల్లో సారా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించి ఇప్పటికే 55 ప్రాంతాలను పూర్తిగా అరికట్టడం జరిగిందన్నారు. త్వరలోనే మిగిలిన ప్రాంతాల్లో కూడా సారాను అరికట్టి అన్నమయ్య జిల్లాను సారా రహిత జిల్లాగా ప్రకటించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నవోదయం ద్వారా సారా విక్రయాలను మానేసిన 325 మందిని గుర్తించి వారికి స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన రుణాలు ఇప్పించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐ భీమలింగ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె: పట్టణంలో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో సచివాలయ ఎమ్యూనిటీస్ సెక్రటరీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొనవచ్చునన్న అంచనాల నేపథ్యంలో ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలకు అసౌకర్యం కలగకుండా పెద్ద ఎత్తున బోర్లు డ్రిల్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టిడిపి నాయకులు తులసి రామకృష్ణ, రమేష్‌రెడ్డి, సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని, ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్, పేదరికం లేని సమాజం పి4 కార్యక్రమం, ఐవిఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లోని విసి హాల్ నుండి కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆగస్టు రెండున రైతుల ఖాతాలలో నగదు బదిలీ కార్యక్రమం జరుగు తుందని అన్ని జిల్లాల కలెక్టర్లు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన వాటిపై సమీక్షిస్తూ అన్న క్యాంటీన్లలో ఆహారం నాణ్యత క్యాంటీన్ నిర్వహణ మునిసిపాలిటీ లలో చెత్త సేకరణ మహిళలకు పోలీసులు అందించే భద్రత మాదకద్రవ్యాల సమస్య లేకుండా చేయడం వంటి అంశాలలో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నీటి వనరుల మరమ్మతు పునరుద్ధరణ కార్యక్రమంలో జిల్లాలలోని నీటి వనరుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : డిఇఒ

ప్రజాశక్తి- రాయచోటి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఉదయం డైట్ మైదానంలో 175 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మొక్కల పెంపకం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థీ ఒక మొక్కను పెంచవలసిన బాధ్యత ఉందన్నారు. రోజు రోజుకూ భూతాపం పెరిగిపోతుందని తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మన ప్రాథమిక బాధ్యతలో భాగంగా ప్రతి ఇంటి చుట్టూ మొక్కలకు కొంచెం స్థలం వదిలి ఇంటి నిర్మాణం చేపట్టుకోవాలని, అలాగే రోడ్ల వెంబడి , పాఠశాలల్లో, బంజరు భూములలో మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాబోయే తరాల ఆశలను, ఆకాంక్షలను, అవసరాలని తీర్చాలంటే మనం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. శిలజ ఇంధనాలు వాడకం తగ్గించి వాటి స్థానంలో సౌర శక్తి బయోగ్యాస్ లాంటి ఇంధనాలని వాడాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు ఉషా మాధురి, గిరిబాబు యాదవ్, శ్రీనివాసులు, మోహన్ నాయక్, కలీముల్లా, శివ ప్రసాద్ పాల్గొన్నారు.


మొక్క నాటి నీరుపోస్తున్న డిఇఒ సుబ్రమణ్యం

ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి: విద్య, ఉపాధ్యాయరంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 2న జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బిటిఎ జిల్లా అధ్యక్షులు రాయచోటి రవిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రజాక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర కోరారు. గురువారం కొత్తపేటలోని బిటిఎ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకులు సమావేశంలో మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. 12వ పిఆర్‌సిని ప్రకటించలేదని, 11పిఆర్‌సికి సంబంధించిన బకాయిలను ఇంతవరకు విడుదల చేయలేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలలో ఒక్కటి కూడా విడుదల చేయలేదని తెలిపారు. ఇటీవల బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదని సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ను కూడా రద్దు చేయాలని చెప్పారు. పై సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొన్నాలన్నారు.

సర్వీసు రూల్స్‌కు విరుద్ధం

ప్రజాశక్తి రాయచోటి: ప్రభుత్వం ఎంఇఒ-1 పోస్టుల్లో గవర్నమెంట్ మేనేజ్మెంట్‌లో పనిచేస్తున్న పాఠశాల సహాయకులను నియమించడం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని ఎపియుఎస్ రాష్ట్ర కార్యదర్శి పోగులు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి అయిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని క్యాంప్ ఆఫీసులో కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఎంఇఒ-2 స్థానంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎంలు పనిచేస్తున్నారని, ఇప్పుడు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన గవర్నమెంట్ మేనేజ్మెంట్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఇఒ-1 స్థానంలో కూర్చోబెట్టడం తీవ్ర అన్యాయమని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో ఎపియుఎస్ నాయకులు పాల్గొన్నారు.

హిందీ సాహిత్యంలో ఆదర్శప్రాయుడు ప్రేమ్‌చంద్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : హిందీ సాహిత్యంలో ప్రేమ్ చంద్ ఆదర్శప్రాయుడని ఎంఇఒ-2 సుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్‌సిలో గురువారం ప్రముఖ రచయిత ప్రేమ్‌చంద్ 145వ జయంతి వేడుకలు సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు పాల్గొన్నారు. ముందుగా ప్రేమ్‌చంద్ చిత్రపటానికి పూలదండతో నివాళులు అర్పించారు. అనంతరం మండల విద్యాధికారి సుబ్బారాయుడు మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ తన రచనలతో యదార్థవాద సాహిత్యానికి నాంది పలికారన్నారు. తన రచనలలో పీడిత ప్రజల, పేద, మధ్య తరగతి సమస్యలను కథా వస్తువుగా ఎన్ను కున్నారన్నారు. బివిఎన్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి హిందీ వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఊటుకూరు జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థి ఎన్.హనీఫా మొదటి బహుమతి, మన్నూరు జడ్‌పి హెచ్‌ఎస్ విద్యార్థిని ఎస్.సబిహ సుల్తానా ద్వితీయ, పుల్లంపేట ఎస్‌బివిడి సభ పాఠశాలకు చెందిన బి.కార్తిక తృతీయ బహుమతి అందుకున్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఆర్.నవ్య శ్రీ, పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎం.శశి ప్రియ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ఉపాధ్యాయులు చాంద్‌బాషా, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



బేపారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రయ్య

బషీర్‌ఖాన్ కుటుంబాన్ని పరామర్శించిన 'సిఆర్‌సి'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అనారోగ్యంతో మృతి చెందిన రాయచోటి మైనార్టీ సీనియర్ నేత బేపారి బషీర్ ఖాన్ కుటుంబాన్ని గురువారం హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే సి.రామచంద్రయ్య పరామర్శించారు. బషీర్ ఖాన్ కుమారుడు మహమ్మద్‌ఖాన్, కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బషీర్‌ఖాన్‌తో తనకున్న సుదీర్ఘ సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ ప్రజల కోసం ఆయన అందించిన సేవలు మరువ లేమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హఠ ప్రసాద్, నాయకులు రసూల్‌ఖాన్, గౌస్‌పీర్, జబివుల్లా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఒబులవారిపల్లె మండల పరిధిలోని మంగంపేట ఆర్ఆర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి రూ.5 లక్షల విరాళం అందించినట్లు తెలిపారు. రామాలయానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి భౌతిక పనులతో పాటు ఆధ్యాత్మిక అవసరమని అన్నారు. గుడి నిర్మాణానికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో రూపానందరెడ్డి, సతీమణి వరలక్ష్మి కుమారుడు వికాస్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన గర్భగుడి



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న నేల మల్లేశ్వర స్వామి (ఫైల్ ఫోటో)

నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ : ఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో ఉన్న నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు, ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలను 2నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. గురు వారం ఆమె మాట్లాడుతూ శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి గర్భగుడి పునర్నిర్మాణం చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం అనంతరం నేల మల్లేశ్వర స్వామికి కలా న్యాస శిఖర జీవధ్వజ ప్రతిష్ఠాసహిత శ్రీకామేశ్వరీదేవి, శ్రీమహాగణపతి పునః ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవం, శనివారం నుంచి సోమవారం వరకు అనంతపురం శ్రీ శివకోటి మహాలక్ష్మి పీఠాధిపతులు శ్రీఅప్పస్వామి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 8గంటలకు మహాగణపతిపూజ, ఆదివారం శిఖర కలశ స్థాపన, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరుగు తుందన్నారు. 4న శ్రీ నేలమల్లేశ్వర స్వామి కల్యాణం, శ్రీ మహా గణపతి శ్రీకామేశ్వరి అమ్మవారి పునః ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం నిర్వహి స్తామన్నారు. అనంతరం 11 గంటలకు శ్రీకామేశ్వరీ సమేత నేలమ ల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడురోజుల పాటు మదనపల్లికి చెందిన గుత్తాంరక్షిత్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి స్తారని చెప్పారు. ఆలయ జీర్ణోద్ధరణ, మహాగణపతి, అమ్మవారి విగ్రహాల పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

టిడిపిలో 40 మంది చేరిక

ప్రజాశక్తి-మదనపల్లె: పట్టణంలోని 1వ వార్డు ఆనాగట్లులో టిడిపి నాయకుడు రఘుపతి నాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో వెంకట నరసింహ తన 40 మంది అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వెంకట నరసింహ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సుసంపన్న పాలన, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో తీసుకుంటున్న చొరవకు ఆకర్షితులై టిడిపిలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగవెంకటరమణ, శేఖర్‌రెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

విజయవాడకు హజ్ ఎంబార్కేషన్ సెంటర్


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హజ్ యాత్రకు వెళ్లే ఆంధ్రప్రదేశ్ ముస్లిం సోదరులకు కేంద్ర ప్రభుత్వం చారిత్రక బహుమతి అందించింది. హజ్-2026 యాత్రికుల సౌలభ్యం కోసం విజయవాడలో కొత్తగా హజ్ ఎంబార్కేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక వినతిపై కేంద్రం సానుకూలంగా స్పందించిన ఫలితంగా తీసుకుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ తెలిపారు. సిఎం చంద్రబాబు సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మైనారిటీ సంక్షేమ శాఖ, కేంద్ర మంత్రులు కిరణ్‌రిజిజు, కె.రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ అవసరాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటివరకు యాత్రికులు హైదరాబాద్ లేదా బెంగళూరు వంటి ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ సెంటర్ల నుంచి హజ్‌కు వెళ్ళాల్సి ఉండేదని అన్నారు. కానీ ఇప్పుడు విజయవాడ నుంచి నేరుగా హజ్‌కు ప్రయాణించేందుకు వీలవుతోందని తెలిపారు. దీనివల్ల భక్తుల ఆర్థికభారం తగ్గడమే కాకుండా ప్రయాణంలో కలిగే ఇబ్బందులు తగ్గుతాయన్నారు. హజ్-2026 దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనందున, రాష్ట్ర ప్రభుత్వం కల్పించే వసతులు, రాయితీలు పొందేందుకు విజయవాడ కేంద్రాన్ని ఎంచుకోవాలని మంత్రి ఫరూక్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హజీ హసన్‌బాషా, సభ్యులు పిలుపునిచ్చారు. దీనిపట్ల టిడిపి నాయకులు, హజ్ కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్ హర్షం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి 'పెద్దిరెడ్డి'ని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బి.కొత్తకోట పట్టణ వైసిపి అధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ, వైసిపి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు అభిలాష్ రెడ్డి, వైసిపి నాయకులు తరుణ్ గురువారం తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టుకు సంబంధించిన విషయాలపై వారు చర్చించారు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని, లిక్కర్ స్కాం కేసులో అక్రమ కేసులతో ఎంపీని అరెస్ట్ చేశారని, త్వరలోనే ఆయన బయటికి వస్తారని మంత్రి తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రతి ప్రజా పక్షాన నిలవాలని సూచించారన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సానుకూలంగా మలుచుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారన్నారు.



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పి4 లక్ష్యాలను చేరుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందరూ చేరుకోవాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం సామకోటవారిపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్‌తో రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులందరూ ఉదయం 10.30 గంటలకు హాజరు తప్పక వేసి సాయంత్రం 5గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ విధులు నిర్వర్తించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పక పాటించాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పి4పై సూచించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఇదివరకే గుర్తించిన బంగారు కుటుంబాలకు మార్గదర్శక కుటుంబాలను ఎంపిక చేయాలన్నారు. మార్గదర్శక కుటుంబాల ఎంపిక ప్రక్రియ 15లోగా పూర్తి చేయాలని అన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ మరింత మెరుగుపడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తస్లిమా నౌరిన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **కలికిరి:** మండలంలోని మేడికుర్తి గ్రామంలోని సచివాలయంలో పి4 పరిధిలో బంగారు కుటుంబాలకు 34 మంది ఎంపికైనట్లు మండల స్పెషల్ ఆఫీసర్, డిఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు. మేడికుర్తిలో గ్రామసభను సెక్రటరీ నవాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగంగా మేడుకుర్తి పంచాయతీలో 34మందిని బంగారు కుటుంబంలో గుర్తించబడ్డాయని, వీరిని మనం దత్తత తీసుకోవడం ద్వారా వారి జీవిత స్థితిగతులు మెరుగుపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి వంటి అంశాల్లో వీరిపై ప్రత్యేక దృష్టి ఉంటుందని, గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు సచేతనంగా ఉండి ప్రభుత్వ పథకాల ఫలాలను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. మానవతను చాటుకునే గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి అల్లా బక్షు, మాజీ సర్పంచ్ ప్రహ్లాద, ఎంఇఒ-2 నాగార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సల్మాభాను, వెల్ఫేర్ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ బి.కృష్ణవేణి, మహిళా పోలీస్ జి.ఎం. వర ప్రియ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



కలికిరి : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : వైసిపి



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని రెండు పంచాయతీలు గుమ్మసంద్రం, వేములేటికోటలో బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పత్రాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రజలకు ఇచ్చిన హామీల మీద చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల కన్నా ఎక్కువే ఇస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తామన్న చంద్రబాబు వారిని నట్టేట ముంచారన్నారు. మహిళలకు అనేక పథకాల పేర్లు పెట్టి చేతులెత్తేశారని విమర్శించారు. ఆడబిడ్డనిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని సిఎం చంద్రబాబు చెబుతుంటే అమలు సాధ్యం కాదని, రాష్ట్రాన్నే అమ్ముకోవాల్సి వస్తోందని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం అంటూ మీ ముందుకు వస్తున్నారని, వారిని నిలదీయాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన వైసిపి పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి హరి, పట్టణ అధ్యక్షుడు సి.ఆర్.చిన్నికృష్ణ, సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందని ఎంపిడిఒ రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచడానికి, అవినీతిని నిరోధించడానికి తీసుకువచ్చిన చట్టమే సమాచార హక్కు చట్టం అన్నారు. సమాచార హక్కు చట్టంలోని వివిధ సెక్షన్లు గురించి వారికి వివరించారు. సెక్షన్ 6,7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు30 రోజుల్లోగా సమాచారాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సెక్షన్ 4(1)(సి) ప్రకారం కార్యాలయం ఆవరణలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పౌర సమాచార అధికారి పేరు, హోదా, మొబైల్ నెంబర్, సహాయ పౌర సమాచార అధికారి పేరు, హోదా మొబైల్ నెంబర్ స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. సెక్షన్ 7లో కాల పరిమితి గురించి కూలంకుశంగా వివరించారు. సెక్షన్ 8, 9 లలో బాహిర్గతం నుంచి మినహాయించబడిన సమాచార వర్గాలను వివరించారు. సెక్షన్ 19(1) ప్రకారం పైస్థాయి అధికారులకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారసెక్షన్ 20(1) (2) ప్రకారం సమాచారం పూర్తిస్థాయిలో లేదా సంతృప్తి కలగని సమాచారం ఇవ్వని సందర్భాలలో సమాచార అధి కారిపై జరిమానా, క్రమశిక్షణాచర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుడు అడిగిన ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల సమాచారం సకాలంలో అందించాల్సిన బాధ్యత అధికారులుగా మనందరిపై ఉందన్నారు. ఈ చట్టాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకుంటే పలు ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపీనాథ్, ఎఒ మంజుల, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల వ్యవసాయ అధికారి బి.గీత ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సునుమండల వ్యవసాయ కేంద్రంలో నిర్వహించారు. ఈ చట్టం ప్రకారము ప్రజలు ప్రభుత్వ సంస్థల నుంచి తమకు అవసరమైన సమాచారాన్ని అభ్యర్థించవచ్చుని తెలిపారు. దానివల్ల ప్రజలకు ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారితనం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లి : సమాచార హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

'జనసురక్ష బీమా' పేదలకు వరం

ప్రజాశక్తి- పుల్లంపేట

జనసుర బీమా పేదలకు వరంలాంటిందని ఎపిజిబి మేనేజరు పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని టి.కమ్మపల్లిలో జన సురక్ష బీమాపై బ్యాంకు సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసురక్ష కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ పథకం పేదలకు వరంలాంటిందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని ఉపయోగించుకొని బీమా చేయించుకోవాలని తెలిపారు. బ్యాంకులో ఉన్న అన్ని రకాల ఇన్స్యూరెన్స్‌లు గురించి వివరిస్తూ, వాటి ప్రయోజ నాలను ఖాతాదారులు, రైతులు, స్వ యం సహాయక బృందాల వారికి వివరించారు. గృహ, వాహన, బంగారు, క్రాప్, మార్టిగేజ్ రుణాల గురించి తెలియజేవారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కుమారి కోమది, క్యాషియర్ జగ్గుబాబు, కెనరా ఇన్స్యూరెన్స్ ఆఫీసర్ చలపతి, పుల్లంపేట మండల టిడిపి అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, పిడికిటి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యంనాయుడు, వెంకటాద్రినాయుడు, గడపర్తి శ్రీనివాసులు, పోలినేని వెంకటేశ్వర్లు, సుబ్బన్న మహిళలు, రైతులు పాల్గొన్నారు.



జనసురక్ష బీమాపై అవగాహన కల్పిస్తున్న ఎపిజిబి మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి



వన్ టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి మహేంద్ర

పెండింగ్ కేసులను పరిష్కరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెండింగ్ కేసులను పరిష్కరించాలని డిఎస్‌పి మహేంద్ర పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మదనపల్లె ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సిఐ రామచంద్ర, ఎస్ఐ అన్సర్‌భాసాల నుంచి రికార్డులను తెప్పించుకొని పరిశీలించారు. ముఖ్యంగా పేద ప్రజలు న్యాయం కోసం స్టేషన్ కు వచ్చి అర్జీలు ఇచ్చినప్పుడు తాత్సారం చేయొద్దని తెలిపారు. వారి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని, తమ పరిధిలో లేకపోతే సంబంధిత అధికారులకు సిఫారసు చేయాలని సూచించారు. ముఖ్యంగా శాంతి భద్రతల పరిర క్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పెట్రోలింగ్ ను సమర్థవంతంగా నిర్వహించి ఈవ్ టీజింగ్ లను అరికట్టాలని, ప్రజలకు పోలీస్ ఉన్నడనే భరోసా కల్పించాలన్నారు. చోరీలను అరికట్టేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని దుకాణాలు, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలను సందర్శించి వారు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఇళ్లల్లో చోరీలను అరికట్టేందుకు ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేయాలని, రాత్రుల్లో గస్తీని ముమ్మరం చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ కూడితో కూడిన విధులను నిర్వహించాలని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- కలకడ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్త్రీశక్తి కార్యక్రమాల నిర్వహణ కొరకు నిర్వహించిన పోలీస్ అధికారి దశరథ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో స్త్రీశక్తి కార్యక్రమాల నిర్వహణ కొరకు పోలీసు బృందం సందర్శించి విద్యార్థిని లకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, గంజాయి, సైబర్ క్రైమ్, బాలికలు తమ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలల గురించి వివరించారు. బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తదనంతరం శక్తి యాప్ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయించి అత్యవసర, ఆపద సమయాల్లో యాప్‌ను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోవిందు, మహిళా పోలీస్ కల్పన, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

- ఉద్యోగాలకు 112 మంది ఎంపిక

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ కృష్ణవేణి, ఎంఇఒ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరుచు కోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 284 మంది పాల్గొనగా 112మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాల ను అందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ ఎల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బి.రాజేంద్ర నాయక్, డిస్టిక్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటేష్, కో-ఆర్డినేటర్ రేవతి, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తరచూ తమ కళాశాలలో నిరుద్యోగుల జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులు సామర్థ్యాన్ని బట్టి తమ కంపెనీలకు ఎంపిక చేసుకున్నారని తెలిపారు.



బాధితుడికి చెక్కును అందిస్తున్న ముక్కా వరలక్ష్మి

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బాలరాజు పెద్ద ముని రాజు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులకు గురవుతున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ బాధితుడికి రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భరించడం ఎంతో కష్టంతో కూడుకున్న పని అని గుర్తించి మానవత దృక్పథంతో ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఆరోగ్య సమ స్యలు ఎదుర్కొంటున్న వృద్ధులు, పేదల పక్షాన రూపానంద రెడ్డి ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. పేదలు, అభాగ్యులకు సాయం చేసేందుకు ఎల్లప్పుడు ముందుంటామని అన్నారు. అభాగ్యులకు ప్రభుత్వం నుంచి కూడా సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, కృష్ణమ నాయుడు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛను అర్హత పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఎన్‌టిఆర్ భరోసా పింఛను పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె

పట్టణంలోని ఎనిమిదో వార్డులో నూతనంగా మంజూరైన ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద ఆరుగురు వృద్ధులకు పెన్షన్ పత్రాలను ఎమ్మెల్యే షాజహాన్ బాషా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఎన్టీఆర్ భరోసాపథకం ఎంతో దోహదపడుతుందని అన్నారు. సిఎం చంద్రబాబు పేదల పక్షపాతి అన్నారు. అర్హులైన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, వింతువులు, ఒంటరి మహిళలను పింఛన్లను అందిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలానికి 140 వితంతు పింఛన్లు మంజూరు

కలికిరి: మండలంలో 140 కొత్త వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ భానుమూర్తిరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండ లంలో కొత్తగా 140 పింఛన్లు మంజూరు అయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ శుక్రవా రం ఉదయం 7 గంటల నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్లను ఇంటి వద్దకే వచ్చి అందిస్తారని, అర్హులందరూ తమ ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కోరారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి- కలకడ

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరిగా ఉంటుందని విశ్రాంతి ఆంగ్ల ఉపాధ్యాయుడు వైవి.రమణ పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి జడ్‌పి హైస్కూల్(తెలుగు)లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకటాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాచారి విద్యార్థుల పట్ల ప్రేమ అనురాగాలు కలిగి మంచి క్రమశిక్షణ కలిగిన విద్యను నేర్పించారని కొనియాడారు. అనంతరం వెంకటాచారి మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివి ఇక్కడే ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరా లను అధిరోహించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ,పట్టుదలతో చదవాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధే ప్రతి గురువు కోరుకుంటారని అన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. అనంతపురం జిల్లా పౌర సంబంధాల అధికారి పివి.రమణ రిటైర్డ్ అయిన వెంకటాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



వెంకటాచారి దంపతులను సన్మానిస్తున్న పివి.రమణ

క్రైం కార్నర్

భార్యపై భర్త హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానం పెనుభూతమై భార్యను కత్తితో పొడిచి హత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన గురు వారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె బసినికొండలో నివాస మున్న కులాయినాయక్ తన భార్య ఆర్.సుజాతబాయి అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటున్నట్లు గుర్తించాడు. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. తను బయటికి వెళ్లి ఇంటికి వచ్చే లోపు భార్య ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతుండ డంతో ఆవేశానికి లోనై కత్తితో దాడి చేసి గొంతు, దొక్కలో పొడిచి హత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అడ్డుకుని తీవ్రంగా గాయపడిన బాధితురాలిని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు చోరీ : కేసు నమోదు

ప్రజాశక్తి- కలకడ

రెండు ద్విచక్ర వాహనాలు చోరీపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే దారిలో ఉన్న బాబా హుస్సేన్‌కు చెందిన రాయల్ ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని జూన్3న గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరొక వాహనం బాలయ్యగారిపల్లి పంచాయతీ సయ్యద్ హుస్సేన్ కు చెందిన రాయల్ ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని ఈ ఏడాది మార్చి నెల ఒకటవ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సయ్యద్ హుస్సేన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.